క్లుప్తంగా

చంద్రబాబువి డైవర్షన్ పాలిటిక్స్


చదలవాడ మెర్లిన్

నరసాపురం: డైవర్షన్ పాలిటిక్స్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబును మించిన వారు లేరని మరోసారి ఆయనే రుజువు చేసుకున్నారని వైఎస్సార్ సీపీ నరసాపురం నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు చదలవాడ మెర్లిన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పాస్టర్ల గౌరవవేతనం కోసం కూటమి సర్కార్ రూ.30 కోట్లు మంజూరుచేయడం వెనుక, పాస్టర్ ప్రవీ ణ్ పగడాల వ్యవహారం క్రిస్టియన్ సోదరులు మరిచిపోవడానికి చేసిన ప్రయత్నంగా కనిపిస్తోందన్నారు. ప్రవీణ్ పగడాల మృతి వ్యవహారంలో ఇంకా పూర్తి నిజానిజాలు బయటకు రాలేదన్నారు. ప్రభుత్వంపై క్రిస్టియన్ మైనార్టీలు గుర్రుగా ఉన్న నేపథ్యంలో అకస్మాత్తుగా వారు గుర్తొచ్చి రూ.30 కోట్లు ప్రకటించారని పేర్కొన్నారు. రంజాన్ వెళ్లిపోయినా ముస్లింల సంక్షేమం గుర్తు రాలేదని ఎద్దేవా చేశారు. అధికారం చేపట్టిన 8 నెలలు అవుతున్నా పూజారుల గౌరవవేతనం ఊసే లేదని విమర్శించారు. రాష్ట్రంలో క్రిస్టియన్ సోదరులు అన్ని విషయాలు గమనిస్తున్నారని వివరించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


గ్యాస్ గోడౌన్ వద్ద అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

నరసాపురం: వేసవిలో అగ్నిప్రమాదాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నరసాపురం ఫైర్ ఆఫీసర్ కె.భాస్కరశ్రీరామ్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని వంట గ్యాస్ గోడౌన్స్ వద్ద, పెట్రోల్ బంకుల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అగ్నిమాక శాఖ అధికారులు, సిబ్బంది అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మంటలు ఎలా అదుపు చేయాలో? అనే అంశాలపై వివరించారు. అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

ఆకివీడులో..

ఆకివీడు: ప్రజలు చైతన్య వంతులు కావడంతో అగ్ని ప్రమాదాలు చాలా వరకూ తగ్గాయని, భవిష్యత్‌లో మరింత అప్రమత్తంగా ఉండి ప్రమాదాలు జరగకుండా చూడాలని ఎస్సై హనుమంతు నాగరాజు విజ్ఞప్తి చేశారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కరపత్రాలు, గోడ పత్రికలను అగ్నిమాపక అధికారి వై.నాగేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యుత్, గ్యాస్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రపంచ కవితోత్సవానికి పెనుగొండ కవులు


బాలచందర్


సుబ్బారావు


గీతా మహాలక్ష్మీ

పెనుగొండ: ప్రపంచ కవితోత్సవానికి పెనుగొండ మండలానికి చెందిన కవులకు ఆహ్వానాలు అందాయి. పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ బాలచందర్ సాదే, ప్రముఖ ఘంటశాల గాన గాయకుడు చివటం సుబ్బారావు, ప్రముఖ కవయిత్రి గుండాల గీతా మహాలక్ష్మీలకు ఆహ్వానాలు అందినట్లు వారు శుక్రవారం విలేకరులకు తెలిపారు. మే 10, 11 తేదీల్లో ఏలూరు లోని గోపాలస్వామి కల్యాణమండపంలో నిర్వహించే కవితోత్సవంలో పాల్గొంటామని తెలిపారు.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

పెనుగొండ : ఆచంట మండలం పెదమల్లంలో డ్రెయినేజీ నిర్మాణానికి శుక్రవారం గ్రామ ప్రముఖులు శంకుస్థాపన చేశారు. రూ.13 లక్షల పంచాయతీ నిధులతో ఈ డ్రెయిన్ నిర్మిస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, సర్పంచ్ దిరిశాల విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నేడు అవగాహన ర్యాలీ

నరసాపురం: స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ నరసాపురం కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు బస్టాండ్ సెంటర్ నుంచి అవగాహనా ర్యాలీ నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కౌన్సిలర్లు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆచంటలో

పెనుగొండ: ఆచంటలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పూర్ణబాబ్జీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆచంట ఎస్బీఐ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహిస్తామని వివరించారు.

ఊపందుకోని వరి మాసూళ్లు


వెంకట్రామపురంలో మెషీన్ ద్వారా వరి కోత చేస్తున్న దృశ్యం

పెనుగొండ: ప్రతి నిమిషం మారుతున్న వాతావరణం వల్ల ఆచంట నియోజకవర్గంలో వరి మాసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. వారం రోజుల క్రితమే వరి కోతలకు రైతులు ఉపక్రమించినా కనీసం 10 శాతం కూడా పూర్తి కాలేదు. ఈ సీజన్‌కు గానూ పెనుగొండ మండలంలో 11782 ఎకరాల్లోనూ, పెనుమంట్ర మండలంలో 12103 ఎకరాల్లోనూ, ఆచంట మండలంలో 10600 ఎకరాల్లో, పోడూరు మండలంలో 12800 ఎకరాల్లో వరి సాగు చేశారు. దీనిలో దాదాపుగా 90 శాతానికి పైగా ఎంటీయూ 1121 వరి రకం సాగు చేశారు. ఎంటీయూ 1121 తరువాత, పీఆర్126 వరి రకం సాగు చేశారు. ఇప్పటికే ఎంటీయూ 1121 వరి రకం కోతకు వచ్చింది.

దూరప్రాంతాల నుంచి వరికోత మెషీన్‌లు

స్థానికంగా ఉన్న వరి కోత యంత్రాలతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి, తమిళనాడు నుంచి వరికోత యంత్రాలు కోతలకు సిద్ధం అయ్యాయి. అయితే వారం రోజులుగా వాతావరణంలో మార్పులతో మధ్యమధ్యలో వర్షం కురుస్తుండడంతో రైతులు గుండెల్లో ఆందోళన మొదలైంది. వారం రోజుల్లో మొత్తం కోతలు పూర్తవుతాయన్న తరుణంలో వర్షంతో కనీసం 10 శాతం కోతలు పూర్తి కాలేదు. నాలుగు రోజుల క్రితం సిద్ధాంతంలో వడగండ్ల వాన సైతం కురువడంతో వరికోత యంత్రాలు వరి చేలల్లో దిగడం కష్టసాధ్యంగా మారింది.

గంటకు రూ.మూడు వేలు

వరికోత యంత్రాలు సంఖ్య అధికంగా ఉండడం, వాతావరణం మార్పులతో రైతులు కోతలకు వెనుకంజ వేస్తుండడంతో గత సీజన్ మాదిరిగానే వరి కోతకు గంటకు రూ.3 వేలు యంత్రాల నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. వర్ష సూచనలు లేకుండా ఎండ నిరంతరం ఉంటే, కోతలకు రైతులు ఒకేసారి సన్నద్ధమయ్యే అవకాశం ఉంది. దీంతో కోత యంత్రాల కొరత ఏర్పడే అవకాశం ఉండడంతో రైతులు వరి కోత యంత్రాల యజమానుల చుట్టూ ప్రదిక్షణలు చేస్తున్నారు. కోత కోసిన వెంటనే ధాన్యాన్ని గట్టుకు చేర్చుకుని వర్షం వచ్చినా బరకాలు కప్పుకొని పంటను కాపాడుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

40 నుంచి 50 బస్తాల దిగుబడి

దాళ్వాసాగులో రైతులు ఎకరానికి 40 నుంచి 50 బస్తాల వరకూ దిగుబడి సాధిస్తున్నారు. కొంతమంది రైతులు అధికంగా 42 బస్తాలు దిగుబడి సాధించారు. మరో 10 రోజుల పాటు వాతావరణం అనుకూలిస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా దాళ్వా సీజన్ నుంచి గట్టెక్కుతామని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


వడలిలో ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతు


అకాల వర్షాలతో తడవకుండా రాశులుగా పోసిన ధాన్యం

వేతన బకాయిలు చెల్లించాలి


మునమర్రులో నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పెనుగొండ: మార్చి నెల నుంచి చెల్లించాల్సిన ఉపాధి పని వేతనాలు తక్షణం చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. శుక్రవారం పెనుగొండ మండలం మునమర్రులో ఉపాధి కూలీలతో కలసి ధర్నా నిర్వహించారు. పని ప్రాంతాల్లో కనీస రక్షణ చర్యలు తీసుకోవడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. కాళ్లల్లో గాజు పెంకులు గుచ్చుకొని బాధపడుతున్న కార్మికులకు ప్రథమ చికిత్స చెయించి, వైద్యం ప్రభుత్వమే చేయించాలని డిమాండ్ చేశారు. వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని ఈ నెల 22న జిల్లా కలెక్టరు కార్యాలయాన్ని కార్మికులతో కలసి ముట్టడి చేయనున్నట్లు తెలిపారు. ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కొరు జగన్నాథం, సీఐటీయూ నాయకుడు ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత


విజేతలకు బహుమతులు అందిస్తున్న విద్యా చైతన్య సమాఖ్య సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో ఫిబ్రవరి 23న 7, 9వ తరగతి విద్యార్థులకు జరిగిన ప్రతిభా పాటవ పరీక్షలు, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. శుక్రవారం స్థానిక ఎంఎంకెఎస్ఎం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన కాకినాడ క్రియా సంస్థ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు మాట్లాడుతూ ప్రతిభా పాటవ పరీక్షల వల్ల విద్యార్థుల్లో ఉన్న స్కిల్స్ బయటపడతాయని అన్నారు. ఐదో తరగతిలో నవోదయ, ఎనిమిదో తరగతిలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష, అలాగే పాలిటెక్నిక్ పరీక్షలు విద్యార్థులందరూ రాయాలని సూచించారు. ఇలా టెస్టులు రాయడం వల్ల విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. అలాగే తమ సంస్థ పెద్దాపురంలో ఉందని ఆ సంస్థను సందర్శిస్తే విద్యార్థులు సొంతంగా ప్రయోగాలు చేసుకోవడం చూపుతామని వివరించారు. సమాఖ్య అధ్యక్షుడు మెరుగు శ్రీనుబాబు మాట్లాడుతూ విజేతలకు రూ.60 వేల విలువైన బహుమతులు అందజేశామన్నారు. ఏడో తరగతిలో 18 మంది, 9వ తరగతిలో 14 మంది వ్యాసరచన పోటీల్లో ముగ్గురు విజేతలకు ఈ నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కానుకొలను శ్రీనివాసరావు, పితాని ధర్మారావు, సంస్థ కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ, ఉపాధ్యాయులు మంచెం కనకరాజు, చేగొండి కరుణ కుమార్, కింజరాపు దుర్గాప్రసాద్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే


గుడ్‌ఫ్రైడే సందర్భంగా శిలువ మోస్తున్న గుడాల గోపి

పాలకొల్లు సెంట్రల్: గుడ్ ఫ్రైడే సందర్భంగా పట్టణ ఆర్‌సీఎం చర్చి వద్ద ఊరేగింపులో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) పాల్గొని శిలువను మోస్తూ గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిలువపై వేలాడుతూ రక్తశిక్తమైన దేహంతో ఉన్నా ప్రేమను పంచుతూ తెలిసోతెలియకో చేస్తున్న వీరిని క్షమించమని వేడుకున్న క్రీస్తు మహనీయుడని కొనియాడారు. అంత కష్టకాలంలో కూడా ఆత్మస్థైర్యంతో నిలబడాలని సందేశాన్ని గుడ్ ఫ్రైడే తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత, పాస్టర్ యాదవ్ కిషోర్, జోగాడ ఉమామహేశ్వరరావు, వీరా మల్లికార్జునుడు, దేవ రాజేష్, బుంగా జయరాజు, రాజు, గంగిరెడ్ల ప్రసాద్, హైమావతి, కుమారి, విశ్వాసులు పాల్గొన్నారు. లాకుపేట సెయింట్ ఆంద్రూస్ లూథరన్ చర్చిలో ఏసుక్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటల వివరణను సంఘ కాపరి పాస్టర్ గమిడి డేవిడ్ రాజు విశ్వాసులకు వివరించారు.

పుచ్చకాయ ముక్కల పంపిణీ

వేసవి చల్లదనాన్ని ఇచ్చి పండ్లు తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిదని నియోజకవర్గ వైఎస్సార్ సిపి ఇంచార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. శుక్రవారం స్థానిక పాత పోలీస్‌స్టేషన్ సెంటర్లో రాహుల్ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో పాదచారులకు పుచ్చకాయ ముక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి.రాంబాబు, గుండుబోయిన నాగేశ్వరరావు, కెల్లా పెద్దిరాజు, కోట రత్నరాజు, రామాంజుల చిన్నమదు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం: గుడ్ ఫ్రైడే పర్వదినం సందర్భంగా పట్టణంలోని అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రసిద్ధ లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు ప్రముఖులు లూథరన్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: ఆచంట, పెనుగొండ మండలాల్లో గుడ్ ఫ్రైడే ను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. చర్చిలు అన్నీ ఉదయం నుంచి కిటకిటలాడాయి. ఆచంట పెదపేట ఇమ్మానుయేలు లూథరన్ చర్చి, సిద్ధాంతంలోని లూథరన్ చర్చి, పెనుగొండలోని క్రీస్తు దేవాలయాల్లో ఉదయం నుంచి ప్రార్థనలు నిర్వహించారు.

క్షీరారామలింగేశ్వరునికి పూజలు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట, రామచంద్రపురం ఆర్‌డీఓలు శ్రీకర్, అఖిలలు దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు ఇద్దరు అధికారులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయ అర్చకులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?


జుత్తిగ వద్ద గోస్తనీ పంటకాలువ గట్టు రోడ్డు దుస్థితి

పెనుమంట్ర: అత్తిలి–ఇరగవరం ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అనుసంధానమైన మల్లిపూడి–జుత్తిగ కెనాల్ రోడ్డు తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేయాలని పరిసర గ్రామ ప్రజలతో పాటు ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. గతంలో జెడ్పీ రోడ్డుగా ఉన్న ఈరోడ్డును ఆర్‌అండ్‌బీ శాఖకు అనుసంధానం చేశారు. ఒకవైపు గోస్తనీ పంటకాలువ, మరోవైపు గోస్తనీ డ్రెయిన్ ఉన్న ఈ రోడ్డున రెండు రైస్ మిల్లులు ఉండటంతో రైతులు తమ ధాన్యాలను రవాణా చేసేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో డెల్టా ఆధునికీకరణలో మల్లిపూడి పుట్‌పాత్ వంతెన నుంచి జుత్తిగ పెద్ద వంతెన వరకు కొంతమేర గోస్తనీ కెనాల్‌లో రిటైనింగ్ వాల్స్ నిర్మించారు. అయితే తదుపరి ఈరోడ్డును ఎవరూ పట్టించుకోకపోవడంతో రోడ్డంతా రాళ్లు లేచిపోయి గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రయాణానికి ఇబ్బందులు

ప్రతి రోజూ ఈ ప్రాంతంనుండి తణుకు ప్రైవేటు పాఠశాలకు వెళ్లే బస్సులతో పాటు గ్రామస్తులు కూడా తణుకు వెళ్లడానికి ఈ రోడ్డునే వినియోగిస్తారు. అయితే అధ్వానంగా ఉన్న ఈ రోడ్డులో ప్రయాణిస్తే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఈ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సిమెంట్ రోడ్డుగా నిర్మించాలి



మల్లిపూడి నుంచి జుత్తిగ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఈరోడ్డు పొడవునా నివాస గృహాలు ఉన్నాయి. ఈ రోడ్డును సిమెంట్ రోడ్డుగా నిర్మించాలి. 1వ వార్డు పరిధిలో ఉన్న ఈ రోడ్డును సీసీ రోడ్డు, డ్రెయిన్‌లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలి. గోస్తనీ పంట కాలువలో కూడా కొంతమేర రిటైనింగ్‌వాల్స్ నిర్మించాల్సి ఉంది.

– వెలగల సత్యనారాయణరెడ్డి, వార్డు మెంబర్, జుత్తిగ

రూ. 1.50 కోట్లతో ప్రతిపాదనలు



మల్లిపూడి పుట్‌పాత్ బ్రిడ్జి నుంచి జుత్తిగలోని నత్తారామేశ్వరం– సిద్ధాంతం రోడ్డు వరకు 750 మీటర్లు పొడవు ఉన్న ఈ రోడ్డును ఉంది. ఈ రోడ్డను సిమెంట్ రోడ్డుగా నిర్మించడంతో పాటు గోస్తనీ కెనాల్‌లో మిగిలిన భాగాన్ని రిటైనింగ్ వాల్స్ నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాం. త్వరలో ఈ రోడ్డు నిర్మాణానికి అనుమతులు వస్తాయి.

– యశ్వంత్, ఆర్‌అండ్‌బీ ఏఈ, పెనుమంట్ర

పైప్‌లైన్‌పై అక్రమ కట్టడం

ఆకివీడు: మండలంలోని పెదకాపవరం గ్రామంలోని మంచినీటి చెరువుకు వెంకయ్య వయ్యేరు పంట కాలువ నుంచి నేరుగా నీరు వచ్చే పైప్‌లైన్‌పై నిర్మించిన అక్రమ కట్టడంతో పైప్‌లైన్ పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. గత నాలుగు రోజుల క్రితం పైప్‌లైన్ పగిలిపోయి నీరు కారడంతో ఆయా ప్రాంతాలను పరిశీలించారు. చివరకు అక్రమ కట్టడం క్రింద పైప్ పగిలినట్లు గుర్తించారు. దీంతో మరమ్మతులు చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు, ఆలకోడు కాలువ గట్టు ఆక్రమించి అక్రమ కట్టడంతో పైప్‌లైన్ పాడైపోతుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమ కట్టడాలు, ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి


సమ్మె బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: మే 20న దేశవ్యాప్తంగా జరగనున్న కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు జవ్వాది శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సంఘ కార్యాలయం వద్ద సమ్మె బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులు అనేక పోరాటాలు ద్వారా సాధించుకున్న చట్టాలు పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం లేబర్ కోడ్‌లుగా మార్చడం సరైనది కాదన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేసి చట్టాలను కొనసాగించాలన్నారు. మే 20న జరిగే సమ్మెలో కార్మిక, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. వేగి రత్తయ్య, తాడి వెంకటేష్, ఆకుల ప్రసాద్, వీరవల్లి సత్యనారాయణ, తుమ్మా సూర్యారావు పాల్గొన్నారు.

గ్రామాల్లో సర్వే టెర్రర్

- 27 రకాల ప్రశ్నలతో సచివాలయ ఉద్యోగుల పీ–4 సర్వే
- సంక్షేమ పథకాలు తొలగిస్తారని అనుమానిస్తున్న ప్రజలు



సీతారామపురం సౌత్ సచివాలయం

నరసాపురం రూరల్: కూటమి ప్రభుత్వం సర్వేలతో ఓ పక్క కాలక్షేపం చేస్తుండగా మరోపక్క ఈ సర్వేలతో తమకు అందే సంక్షేమ పథకాల్లో కోత విధిస్తారేమో? అనే భయాలు ప్రజానీకంలో నెలకొన్నాయి. సచివాలయ ఉద్యోగులతో 27 ప్రశ్నలతో కూడిన పీ–4 సర్వేతో సెలవు రోజుల్లో సైతం సచివాలయ ఉద్యోగులతో ఉన్నతాధికారులు సర్వే చేయిస్తున్నారు. లక్ష్యాలు చేరుకోని ఉద్యోగులకు షోకాజ్ నోటీసులను సైతం జారీ చేస్తున్నారు. ఈ సర్వేలతో ప్రజానీకానికి ఏమి ఉపయోగం ఉంటుందో? సీఎం చంద్రబాబునాయుడికి తప్ప మరెవరికీ అంతు పట్టడం లేదు. టెక్నాలజీని ఉపయోగించుకుని పేదలందరికీ మేలు చేస్తానని ప్రతి సమావేశంలోనూ చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వడం మినహా అధికారంలోకి వచ్చిన ఈ పదినెలల కాలంలో ప్రజలకు ఒరగబెట్టిందేమీలేదని ప్రజలుపెదవి విరుస్తున్నారు.

ప్రశ్నలతో సతమతం

ఇంటికి వచ్చిన సర్వే సిబ్బంది అడిగే ప్రశ్నలు చాలా వింతగా ఉంటున్నాయి. టీవీ ఉందా? పిల్లలు ఎంతమంది? ఏం చదువుకున్నారు? మీ పిల్లలు ఇక్కడ ఉన్నారా? లేక విదేశాల్లో ఉన్నారా? మీ ఇంట్లో ఫ్రిడ్జ్ ఉందా? ఎన్ని స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి. పింఛన్ వస్తుందా? ఎంతకాలం నుంచి తీసుకుంటున్నారు? ఇన్‌కం ట్యాక్స్ చెల్లిస్తున్నారా? నాలుగు చక్రాల వాహనం ఉందా? ఇలా ఊపిరి ఆడకుండా ప్రశ్నల పైన ప్రశ్నలు వేస్తూ సచివాలయ ఉద్యోగులు సర్వే పూర్తియ్యిందనిపిస్తున్నారు. ఈ సర్వేలతో పింఛన్‌దారుల గుండెల్లో దడ మొదలైంది. ఇప్పటికే వికలాంగుల పింఛన్‌లలో అవకతవకలు జరిగాయనే నెపంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ వికలాంగ ఫించన్ల పరిశీలనా కార్యక్రమం ఓ వైపు మరో వైపు ఈ పీ–4 సర్వేతో ఇతర పింఛన్లు, సంక్షేమ పథకాల్లో ప్రభుత్వం కోత పెడుతుందని ప్రచారం జరుగుతుండడంతో ఆయా వర్గాల్లో ఆందోళన నెలకొంది.


అవగాహన కలిగించాలి



పీ–4 సర్వేతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ముందుగా ఈ సర్వేపై సచివాలయ సిబ్బందికి, ప్రజానీకానికి అవగాహన కలిగించాలి. సర్వేతో కలిగే లాభ నష్టాలను వివరించాలి. ప్రజల్లో నెలకొన్న భయాందోళనను తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అసంపూర్తిగా సర్వే చేసేశారంటూ సచివాలయ సిబ్బందికి నోటీలు జారీచేయడం తగదు.

– దొండపాటి వెంకట్, సర్పంచ్, సీతారామపురం సౌత్

పథకాలు తగ్గించేందుకే సర్వే



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను అమలుచేయలేక ప్రజల దృష్టిని మరలించేందుకు పీ–4 సర్వే పేరుతో ప్రభుత్వం కొత్తనాటకానికి తెర తీసింది. సర్వే పేరుతో సంక్షేమ పథకాల్లో కోత విధిస్తే సహించం. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఈ సమాచారం ఎందుకు అని ప్రశ్నిస్తే సచివాలయ సిబ్బంది సమాధానం ఇవ్వడం లేదు.

– చినమిల్లి చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు, నరసాపురం

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసాపురం డివిజన్
90102 23729 (పాలకొల్లు)
81869 95956 (నరసాపురం)
90102 23729 (ఆచంట)
Office mail : tpgadvt@gmail.com